నేటి నుంచి చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కీసర, ఏప్రిల్ 23: చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి 27 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ తెలిపారు. భక్తులకు నిత్యాన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, చలువ పందిళ్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఈ వేడుకలను నిర్వహిస్తామన్నారు.గురువారం సాయంత్రం ఆలయ చైర్మన్ ఇంటి నుంచి స్వామివారిని చీర్యాల్ గ్రామంలో ఊరేగింపుగా ఆలయం వరకు బ్యాండ్ మేళాలు, ఊరేగింపుగా స్వామివారిని తీసుకొస్తారు. భక్తుల అధిక సంఖ్యలోహాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పోరాటానికి మద్దతుగా నిలుస్తాం

ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం సంవప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్

మల్కాజిగిరి, ఏప్రిల్ 23 : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు జేఏసీ వెంకన్న, ఖలీల్, రాము యాదవ్, నర్సింగ్‌రావు, సతీశ్, శ్రీనివాస్ గౌడ్, ఉపేందర్, బాబు పటేల్, నర్సింగ్, జనార్దన్, సిద్ధి రాములు, సైదులు,నవనీత, వేణు యాదవ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలంటూ టీచర్ల ధర్నా

ఉప్పల్, ఏప్రిల్ 23: మండలంలోని నల్లచెరువు దగ్గర ఉన్న శ్రీ చైతన్య స్కూల్లో పనిచేస్తున్న టీచర్లను ఆరు నెలలుగా ప్రిన్సిపాల్ జ్యోత్స్న వేధింపులకు గురి చేస్తున్నారని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోత్స్నను వెంటనే తొలగించాలని శ్రీ చైతన్య యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిరవధిక ధర్నా చేపట్టారు.

ధర్నా చేస్తున్న పాఠశాల సిబ్బంది

డివిజన్ల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి

ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో రూ. 3.2కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్

కాప్రా,ఏప్రిల్ 23: ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని డివిజనల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో రూ.30 లక్షలు, శ్రీనివాస్‌నగర్‌లో రూ. 50లక్షలు,భవానీ నగర్లో రూ. 20 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులు, మార్కండేయనగర్ నుంచి సుబ్రహ్మణ్యనగర్ వరకు రూ.2.20లక్షలతో చేపట్టే బాక్స్ డ్రైన్ పనులు, మొత్తం రూ.3.2 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా కాలనీల్లో తన దృష్టికి వచ్చిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డీఈఈ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సోమశేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాలరాజు, కుమారస్వామి, షేర్ మణెమ్మ, యాకయ్య, లక్ష్మీనారాయణ పటేల్, ఏఈలు, కాలనీ సంఘాల ప్రతినిధులు రాఘవరెడ్డి, పెంటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఉప్పల్: నాచారం రవీంద్రానగర్‌లోని సాయిబాబా ఆలయంలో నూతనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హాజరైనారు.

ఘట్‌కేసర్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

ఘట్ కేసర్ ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ ప్లాజా సమీపంలో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, నవీన్ ప్రకాశ్,పార్టీ శ్రేణులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 23: ఘట్‌కేసర్ పట్టణంలోని ఆవుటర్ రింగ్ రోడ్ టోల్‌ప్లాజా వద్ద వరంగల్ వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నోముల నవీన్ ప్రకాశ్‌ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని, అధిక సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల రెడ్డి, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు ఎండీ సిరాజ్, సీనియర్ నాయకులు కృపాకర్, అన్నూబాయ్, షకీల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఈడీ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

రజతోత్సవ సభకు దండులా కదలాలి

వెంటాపురం డివిజన్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్వాల్ డివిజన్‌లో పార్టీ జెండా దిమ్మెలకు రంగులు వేస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి

చర్లపల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

పలు చోట్ల రజతోత్సవసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన కార్పొరేటర్లు

చర్లపల్లి,ఏప్రిల్23: వరంగల్‌లో నిర్వహించే బీఆ ర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు దండులా కదలాలని బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు నేమూరి మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని సిరీగార్డెన్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రజతోత్సవ సభ సందర్భంగా సన్నాహక సమావేశాన్ని నిర్వహించి సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అమ లు కానీ హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. డివిజన్ నుంచి రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌గౌడ్, కనకరాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిబాబు, ప్రభాకర్‌రెడ్డి, జయకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, రాజుగౌడ్, బాబు, బాల్‌రాజు, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా అల్వాల్‌లోని పార్టీ జెండా గద్దెలకు రంగులను కార్పొరేటర్ వేశారు. వెంకటాపురం లో నాయకులు సభా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుల యాదగిరి గౌడ్, అనిల్‌కిశోర్, చంద్రశేఖర్, అరవింద్, శ్రీనివాస్, మహేశ్, సాజిద్, సతీష్, శ్రీనివాస్, మోసిన్, రాజు, ప్రభాకర్, బాలి, విజయశేఖర్, సదానంద్, వీరేష్, జమేదార్, నర్సింగ్, కన్న, జనార్దన్, తాజుద్దిన్ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో జన్నురాం కాలనీ

- ఎక్కడపడితే అక్కడ మురికికంపు
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- పొంగిపొర్లుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

జన్నురాం కాలనీలో నీటి కోసం డ్రమ్ములు పెట్టి పడిగాపుకాస్తున్న కాలనీవాసులు

పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కీసర, ఏప్రిల్ 24: జన్నురాం కాలనీలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఇక్కడి ప్రజలు సమస్యలతో చచ్చీ బతుకుతున్నారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి చీర్యాల్ రెవెన్యూ పరిధిలోని జన్నురాం కాలనీ ఏర్పడి సుమారు 20సంవత్సరాలు అవుతున్నా ఇక్కడి సమస్యలను పరిష్కరించిన నాథుడే లేకపోయాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2005 సంవత్సరంలో ఈ కాలనీని ఏర్పాటు చేశారు. ఇక్కడ 29 బ్లాక్‌లో ఒక్కో బ్లాక్‌లో 24 కుటుంబాల చొప్పున మొత్తం 696 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఏడు సంవత్సరాల క్రితం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఇంత వరకు ఆ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిందిలేదు. ఆ కాలనీవాసులకు నీరు అందింది లేదు. ఆ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు పొంగిపొర్లి కంపుతో దుర్వాసన వస్తుందని ఈ విషయంపై దమ్మాయిగూడ కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరులేక అలమటిస్తున్నామని, 15 రోజులకోసారి డ్రమ్‌లో నీరు పోసి చేతులు దులుపుకుంటున్నారని, ఆ కలుషి నీటి తాగడం వల్ల రోగాలు వస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు.సమస్యల మధ్య తమ జీవితాలను వెళ్ల దీస్తున్నామని ఆందోళనకు గురవుతున్నారు. కాలనీ పక్కనే జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు ఉండటంతో భూగర్భ జలాలన్నీ పూర్తిగా కలుషితమైపోతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీవాసు లు కోరుతున్నారు.

మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు

కాలనీ సమస్యలపై అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోనే నాథుడే లేడు. ఎన్నిమార్లు వినతిపత్రాలు ఇచ్చిన అధికారులు తమ కాలనీల్లోకి తొంగి చూడడం లేదు. తమను వెనుబడ్డ కాలనీగా నమోదు చేసుకొన్నారు. నీటి సమస్యతో పాటు డ్రైనేజీ సమస్య మరింత జఠిలంగా ఉంది.

-చంద్రం కాలనీవాసి.

నీరు లేక చాలా అవస్థలు పడుతున్నాం

కాలనీకి నీరులేక చాలాఅవస్థలు పడుతు న్నాం. దమ్మాయిగూడ మున్సిపాల్టీ ద్వారా 15 రోజుల కొకసారిగా మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సప్లయ్ చేస్తున్నారు. ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నాం. దవాఖానల చుట్టూ తిరిగి డబ్బులు వృథా చేసుకొంటున్నాం. తమ కాలనీలో నెలకొన్న సమస్యల గుర్తించి పరిష్కరించాలి.

-బూరుగు నరేశ్ కాలనీ వాసి

మే 11 నుంచి సెల్ట్ ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో మే 1 నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రతీ ఏటా వేసవిలో నెలపాటు సర్టిఫికెట్ కోర్సును సెల్ట్‌లో నిర్వహిస్తారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఒక నెల కోర్సుకు పాఠశాల విద్యార్థులకు ఉదయం 8.15 గంటల నుంచి 9.45 గంటల వరకు ప్రత్యేక బ్యాచ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 79899 03001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. వివరాలకు 83090 37134, 68058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమతి లేని హోర్డింగ్‌ల తొలగింపు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో దూలపల్లి–కొంపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రకటనల హోర్డింగ్ బోర్డులను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు నిర్వాహకులు మధ్యవర్తులతో కుమ్మక్కై ప్రకటనలు చేస్తూ వ్యాపారంగా మలచుకున్నారని, అధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించి కొంపల్లిలో 2 హోర్డింగులు, దూలపల్లిలో 2 హోర్డింగులు కూల్చివేసినట్లు తెలిపారు.

ఉగ్రవాదులను అంతమొందించాలి

కాప్రా, ఏప్రిల్ 23: కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం పర్యాటకులపై విచక్షణారహితంగా బుల్లెట్లతో దాడులు చేసిన ఉగ్రవాదులను అంతమొందించాలని సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తాలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్.బోస్ మాట్లాడుతూ ఉగ్రదాడికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, దాడిలో మరణించిన వారికి రూ. కోటి, గాయపడిన వారికి రూ. 25లక్షలు నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈసీఐఎల్ చౌరస్తాలో సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

సీఎంఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

అధ్యాపకుడు వడ్డే నర్సింహ

మేడ్చల్, ఏప్రిల్ 23 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ లభించింది. కళాశాలలో సీఎస్ఈ అధ్యాపకుడికి పనిచేస్తున్న వడ్డే నర్సింహ జేఎన్‌టీయూహెచ్ నుంచి డాక్టరేట్ పొందాడు. ఆయన జేఎన్‌టీయూహెచ్ అధ్యాపకురాలు ధనలక్ష్మి పర్యవేక్షణలో ' సెవెరిటీ ప్రిడిక్షన్ ఆన్ చెస్ట్ ఎక్స్‌రేస్ ఫర్ కొవిడ్ 19 యూజింగ్ మెషిన్ లర్నింగ్ టెక్నాలజీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన పత్రాలను జేఎన్‌టీయూహెచ్ ఆమోదించి, డాక్టరేట్‌ను బుధవారం ప్రదానం చేసింది. వడ్డే నర్సింహ పీహెచ్‌డీ పట్టాల లభించిన సందర్భంగా కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ శేషుకుమార్, డైరెక్టర్ వీఏ నారాయణ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

నాలాలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

రామంతాపూర్, ఏప్రిల్ 23: నాలాల్లో పూడికతీత పనులను బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రి వేళల్లో నాలాల్లో మట్టి ఇతర వ్యర్థాలను టిప్పర్ల ద్వారా తెచ్చి పారబోస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, వ్యర్థాలు నాలాలో పారబోస్తున్న వారి టిప్పర్లను ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి భారీ జరిమానాలను విధించాలని ఆమె అధికారులకు సూచించారు. నాలా పూడికతీత పనులను తాను ప్రతిరోజు పరిశీలిస్తానని, అధికారులు కూడా పర్యవేక్షించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ నాగమణి అసిస్టెంట్ ఇంజినీర్ శ్వేత వర్క్ ఇన్‌స్పెక్టర్‌మహేందర్ పాల్గొన్నారు.

భూ భారతితో భూసమస్యలకు పరిష్కారం

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పీర్జాదిగూడ ఏప్రిల్ 23: నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో భూ సమస్యలు సులభ పద్ధతిలో పరిష్కారమవుతాయని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ తెలిసీతెలియక జరిగిన తప్పులను సవరించే ఆప్షన్ ఈ చట్టంలో ఉందని తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందే అవసరం లేదని అన్నారు. ఆధార్ నంబర్లు ఉన్నట్లు భూధార్ నంబర్లు భూమికి ఉండాలన్నదే పోర్టల్ లక్ష్యమని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు ఆబాది వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో సమగ్రాభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రిలేశ్వరరావు,అధికారులు రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేడ్చల్, ఏప్రిల్ 23 : గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ... మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై నిజామాబాద్ నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా గుర్తు తెలియని లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏండ్లు ఉంటుంది. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే మేడ్చల్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లొమా కోర్సులతో పాటు ఏడాది అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తరగతులను జూలై 7 నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు జూనియర్ డిప్లొమాలో చేరేందుకు అర్హులని, సీనియర్ డిప్లొమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో జూనియర్ డిప్లొమా కానీ, యూజీలో సంబంధిత భాషను సెకెండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలని చెప్పారు. డిప్లొమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో సీనియర్ డిప్లొమా పాసై ఉండాలని వివరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు విదేశీ భాషల విభాగం కార్యాలయంలో గాని 83310 41309 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులు దాఖలు చేసేందుకు జూలై నెల 5వ తేదీ ఆఖరు అని చెప్పారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ ఫీజును ఈనెల 26వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

PUBLIC NOTICE

The General Public and all concerned are hereby informed that my client **SRI LINGAMPALLY DEVENDAR,** S/o. Sri L.VenkatRamnarsaiah,has entered an agreement of sale and purchase, with Mrs. Dr. MANASA CHINTAWAR, W/o. Sri Dr. Gopi Tupkar, in respect to the all that the Flat No. 615 in Sixth Floor, in H. No. 1-5-9/PB/615, of Pearl Block "SAI SUKHA VISTAS", admeasuring 1715 Sq. fts., with two car parking's of 160 Sq. fts., including common area together with 59.00 Sq. yds., of undivided share of land out of Ac. 5.061 gts., of land in APIIC allotted Plot No. 9/1, Block-B, in parts of Sy. Nos. 581/1, 581/2, 582, and 583, situated at IDA Uppal, Uppal Mandal, under GHMC Uppal Circle, Medchal-Malkajgiri District, andwho acquired the same through a registered Gift Deed, dated 25.07.2024, registered as Doct. No. 10118 of 2024, of Sub-Registrar,Uppal from her Donor viz., Smt. Dr. UMA CHINTAWAR.

Any person or persons having any right, interest over the aforesaid property may contact the undersigned with all relevant documents in original in support of their claim within (7) days from the date of this publication, thereafter, my client will proceed to complete the sale transaction and objections if any raised thereafter will not be entertained.

Sd/- **G. JITENDAR SINGH,** B.A.,LL.B., ADVOCATE, Office at Plot No.10-38, Indrapratha Enclave, Medipally, Medchal - Malkajgiri - 98, Ph.No.(M) 94916 79553.